క్లుప్తంగా

వైద్య చికిత్సకు ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న గ్రామస్తులు

ప్యాపిలి: మండల పరిధిలోని సీతమ్మతండా గ్రామానికి చెందిన తావూరు నాయక్ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. కర్నూలులోని ఓమ్నీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం విషయం తెలుసుకున్న గ్రామస్తులు, ఉద్యోగులు వైద్య చికిత్సకు తమ వంతుగా రూ.8 వేలను బాధితుడి భార్య రోగిబాయికి అందజేశారు. లక్ష్మన్‌నాయక్, అశోక్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఈత పోటీల్లో ప్రతిభ



విద్యార్థినులతో పీఈటీ

ప్యాపిలి: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు జాతీయ స్థాయి ఈత పోటీల్లో ప్రతిభ చాటినట్లు హెచ్‌ఎం సరళా దేవి, పీఈటీ విజయలక్ష్మి శుక్రవారం తెలిపారు. గుజరాత్ రాష్ట్రంలోని రాజ్‌కోట్‌లో సర్దార్ వల్లభాయి పటేల్ స్విమ్మింగ్ పూల్‌లో ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు జరిగిన పోటీల్లో విద్యార్థినులు పాల్గొన్నట్లు చెప్పారు. పదో తరగతి విద్యార్థినులు బెస్త సురేఖ, కోట వైశాలి, ఎనిమిదో తరగతి విద్యార్థిని మెట్టుపల్లి అర్చన ప్రతిభ చాటి ప్రశంసాపత్రాలు అందుకున్నట్లు వివరించారు.

కార్తీక వన భోజనాలతో ఐకమత్యత



భోజనాలు వడ్డిస్తున్న నిర్వాహకులు

డోన్ టౌన్: కార్తీక మాసంలో వనభోజనాల కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఆధ్యాత్మికత, ఐక్యమత్యం పెరుగుతుందని యల్లమాంబేశ్వరి ఆలయ ధర్మకర్త ఏఈ నాగరాజు అన్నారు. శుక్రవారం కొండపేటలోని ఆలయంలో కార్తీక వన భోజన మహోత్సవం నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన, మంగళ హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సోమన్నగౌడ్, భక్తులు పాల్గొన్నారు.

వైభవం.. చౌడేశ్వరిదేవి పల్లకోత్సవం



పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకీలో ఉంచి ఊరేగించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మహిషాసురమర్దిని దేవికి కవచం బహూకరణ



అమ్మవారికి కవచం అందజేస్తున్న దాతలు

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గాపేట కాలనీలో వెలసిన మహిషాసురమర్దిని అమ్మవారికి శుక్రవారం రూ.25 వేల విలువైన పంచలోహ కవచాన్ని ఆలయ సెక్రటరీ శివశంకర్ కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాలనీవాసులు, ఆలయ కమిటీ సభ్యులు శివశంకర్‌ను సత్కరించారు.

హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేద్దాం

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో డిసెంబర్ 1వ తేదీ సాయంత్రం 4 గంటలకు జరగనున్న విశ్వహిందూ పరిషత్, హైందవ శంఖారావం హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, మండల కన్వీనర్ కందగడ్డల రామూర్తి కోరారు. శుక్రవారం పట్టణంలోని వికాస నిలయంలో నాయకులు నాగ మోహన్, మధుమోహన్ రెడ్డి, గూని నాగరాజు, శ్రీనివాసులు, మురళీ, లక్ష్మినారాయణ, రవితో కలిసి కరపత్రాలను విడుదల చేశారు.

అస్మదీయులకే గోకులం..!

- పలుకుబడి ఉన్న వారికే గోకులం షెడ్లు
- అధికార పార్టీ నాయకుల చుట్టూ పాడి రైతుల ప్రదక్షిణ
- నియోజకవర్గంలో 166 గోకులం యూనిట్ల మంజూరు
- వచ్చిన దరఖాస్తులు 463



గోకులం షెడ్డు

బనగానపల్లె రూరల్: జాతీయ ఉపాధి హామీ పథకం కింద మినీగోకులం షెడ్ల నిర్మాణానికి పాడి రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే ప్రభుత్వం అరకొరగా యూనిట్లు మంజూరు చేయడంతో పలుకుబడి ఉన్న రైతులకే యూనిట్లు దక్కే అవకాశం ఉందని పాడి రైతులు ఆవేదన చెందుతున్నారు. కొందరు టీడీపీ నాయకులు అధికారాన్ని అడ్డు పెట్టుకుని తమకు కావాల్సిన వారికే మంజూరు చేయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గోకులం షెడ్లలో గొర్రెలు, మేకలకు సంబంధించి 70 శాతం, కోళ్లకు 70 శాతం, పాడి రైతులకు 90 శాతం రాయితీపై వీటిని మంజూరు చేస్తోంది. ప్రస్తుతం బనగానపల్లె నియోజకవర్గానికి మంజూరు చేసిన యూనిట్లు ఏమాత్రం సరిపోవని.. యూనిట్ల సంఖ్య పెంచాలని రైతులు కోరుతున్నారు. నియోజకవర్గంలోని బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల మండలాల్లో మినీగోకుల యూనిట్లు 166 మంజూరు కాగా వీటి కోసం 463 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల సంఖ్య ఎక్కువగా రావడంతో మినీగోకుల మంజూరులో అధికార పార్టీ నాయకులు తమ పలుకుబడి ఉపయోగిస్తున్నారు. దీంతో రైతులు పార్టీ నాయకుల ప్రశన్నం కోసం ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రాయితీ ఇలా..

రెండు పశువులు ఉన్న యూనిట్ షెడ్డుకు రూ.1.15 లక్షలు కాగా రైతు వాటా రూ. 11,500 చెల్లించాల్సి ఉంటుంది. నాలుగు పశువులు ఉన్న షెడ్డుకు యూనిట్ రూ.1.85 లక్షలు కాగా రైతు వాటా రూ.18,500. ఆరు పశువుల కంటే ఎక్కువ ఉంటే యూనిట్ రూ.2.30 లక్షలు, రైతు వాటా రూ.23 వేలు చెల్లించాల్సి ఉంది. మొత్తంగా 90 శాతం రాయితీ ఉంటుంది. అలాగే 20 గొర్రెలు, మేకల యూనిట్ రూ.1,30,000 కాగా రైతు వాటా రూ.30 వేలు, 50 గొర్రెలు, మేకలు దాటితే యూనిట్ రూ.2.30 లక్షలు, రైతు వాటా రూ.60 వేలు, అలాగే వంద కోళ్ల యూనిట్ రూ.87 వేలు కాగా రైతు వాటా రూ. 26,100, 200 కోళ్ల యూనిట్ రూ.1.32 లక్షలు ఉండగా రైతు వాటాగా రూ.39,600 చెల్లించాల్సి ఉంటుంది. వీటికి 70 శాతం సబ్సిడీ పోను 30 శాతం వాటా రైతులు చెల్లించాలి.

లబ్ధిదారుల ఎంపికకు ఉన్న నిబంధనలు

- దరఖాస్తుదారుడి పేరుతో స్థలం ఉండాలి.
- గ్రామ సభ ద్వారా పంచాయతీ తీర్మాణం చేసి ఉండాలి.
- దరఖాస్తుదారులు బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు దరఖాస్తుతో జత చేయాలి.
- ఎంపికలో ఎస్సీ, ఎస్టీ, పేద మహిళలకు మొదటి ప్రాధాన్యత.
- లబ్ధిదారులు చిన్న, సన్నకారు రైతులై ఉండాలి.
- ఉపాధిహామీ పథకం జాబ్ కార్డు తప్పనిసరి.

యూనిట్ల సంఖ్య పెంచాలి



అర్హత ఉండి మినీగోకులాల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ షెడ్లు మంజూరు చేయాలి. యూనిట్ల మంజూరులో ఎలాంటి రాజకీయం లేకుండా పారదర్శకంగా కేటాయించాలి. మండలాల వారీగా మంజూరైన యూనిట్ల సంఖ్యను మరింత పెంచాలి.

–ప్రతాప్‌రెడ్డి, రైతు, కైప

మండలానికి 50 యూనిట్లు మంజూరు



మండలానికి 50 యూనిట్ల గోకులాలు మంజూరు అయ్యాయి. మినీ గోకులాలకు రైతుల నుంచి ఎక్కువగా డిమాండ్ ఉంది. బనగానపల్లె మండలంలో 179 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. మంజూరైన గోకులాలు వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. మంజురు కోసం కోసం ఎవరి రెకమెండేషన్ అవసరం లేదు. పశువైద్యులు పరిశీలించి పంపిన దరఖాస్తుతో పాటు అన్ని అర్హతలు ఉంటే క్షేత్రస్థాయిలో ఏపీఓ, టీఏ,ఈసీలు పరిశీలించి యూనిట్లు మంజూరు చేస్తారు.

–రేష్మా, ఉపాధిహామీ ఏపీఎం, బనగానపల్లె

ఉపాధి పనులు కల్పించాలని వినతి



ఎంపీడీఓకు వినతి పత్రం అందిస్తున్న సర్పంచ్

డోన్ రూరల్: మండల పరిధిలోని ఎద్దుపెంట, అనుంపల్లి, మిద్దెపల్లి గ్రామాల్లో పనులు లేక గ్రామస్తులు వలసలు పోతున్నారని.. వారికి ఉపాధి హామీ పనులు కల్పించాలని ఎద్దుపెంట సర్పంచ్ బంగారు జయచంద్ర కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డికి వినతి పత్రం అందించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో పనులు లేక చాలా మంది ఇబ్బందులు పడుతున్నారని.. కుటుంబ పోషణ భారంగా మారిందని తెలిపారు. అలాగే మినీ గోకులాల షెడ్లను రైతులకు ఇచ్చేలా చూడాలన్నారు.

నేటి నుంచి అయ్యప్పస్వాములకు బిక్ష

కొలిమిగుండ్ల: కనకాద్రిపల్లెలోని అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం నుంచి జనవరి 13వ తేదీ వరకు దాతల సహకారంతో అయ్యప్పమాలధారులకు మధ్యాహ్నం బిక్ష ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. మండలంలోని అయ్యప్ప స్వాములే కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన వారు కూడా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దాతల సహకారంతో ఏటా స్వాములకు బిక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో స్వాతి వేడుకలు





ఆలయ మాడ వీధుల్లో స్వామివారి ఊరేగింపు, నరసింహస్వామికి సహస్ర దీపాలంకరణ సేవ

బేతంచెర్ల: ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈఓ రామాంజనేయులు, వేదపండితులు జ్వాలా చక్రవర్తి ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేతుడైన నరసింహస్వామికి సుప్రభాత సేవ, పుణ్యాహవచనం, సుదర్శన హోమం, నవ కలశ స్నపనం, నరసింహ హోమం, తిరుమంజనం, ధన్వంతరి మూల మంత్ర జపం తదితర పూజలు చేశారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవను కనుల పండువగా నిర్వహించారు. డోలు వాయిద్యా ల నడుమ స్వామివారిని ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు మద్దిలేటిస్వామి, అర్చకులు మనోహర్, రాఘవయ్య పాల్గొన్నారు.

గౌడ సంఘం కార్తీక వనభోజనం

బనగానపల్లె రూరల్ : స్థానిక రవ్వలకొండపై వెలసిన హట్టిముని స్వామి ఆలయ అవరణలో గౌడ సంఘం కార్తీక వనభోజన కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సామూహిక గోమాత పూజ,రేణుకా ఎల్లమాంబ విగ్రహానికి కుంకు మార్చన,పుష్పార్చన, కార్తీక వనభోజన కార్యక్రమం అనంతరం అధ్యాత్మిక సభ జరిగింది. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు తిరుపాల్‌గౌడ్, దేవుడు, హరినాథ్‌గౌడ్,దొంతా వెంకటేశ్వర్లుతో పాటు గౌడ కులస్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రేణుక ఎల్లమాంబకు పూజలు నిర్వహిస్తున్న గౌడ(ఈడిగ) కులస్తులు

నందీశ్వరుడికి అభిషేకం

డోన్ టౌన్: కార్తీక మాసం పురస్కరించుకుని పట్టణంలోని వైఎస్ నగర్‌లో వెలసిన శివాలయంలో స్వామివారికి శుక్రవారం ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు హరిశర్మస్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులతో ఇక్కట్లు

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామంలో రైల్వే డబుల్ లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ, పాణ్యం మండల కందికాయపల్లె గ్రామాలకు వెళ్లడానికి నూతనంగా బ్రిడ్జి నిర్మిస్తున్నారు. అయితే నిర్మాణ పనులు పూర్తి కాకముందే పాత బ్రిడ్జిని కూల్చివేయడానికి రైల్వే అధికారులు శుక్రవారం పనులు చేపట్టారు. దీంతో కందికాయపల్లె గ్రామస్తులు, విద్యార్థులు గ్రామానికి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన రోడ్డు ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి మాత్రమే సౌకర్యంగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. నూతన రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేసిన తర్వాతే పాత బ్రిడ్జిని కూల్చివేయాలని కందికాయపల్లె గ్రామస్తులు కోరుతున్నారు. రైల్వే కంట్రాక్టర్ సతీష్‌రెడ్డిని వివరణ కోరగా కందికాయపల్లె గ్రామస్తులకు ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటు చేసిన తరువాతనే పాత బ్రిడ్జిని కూల్చివేస్తామని తెలిపారు.

కల్యాణ వైభోగం



స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా శుక్రవారం కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ చంద్రుడు, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, పూజలు చేశారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను సుందరంగా ముస్తాబు చేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు.. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే బనగానపల్లె పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న చెంచులక్ష్మీసమేత పవన నరసింహస్వామి ఆలయంలో బాలిశెట్టి పవన నరసింహమూర్తి ఆధ్వర్యంలో స్వాతి నక్షత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు.

మొక్కుబడిగా కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న నగర పంచాయతీ వైస్ చైర్మన్ పర్వీన్



హాజరైన వార్డు కౌన్సిలర్లు

- నివేదికలు వినిపించడంతో సరి

బేతంచెర్ల: వార్డు కౌన్సిల్ సాధారణ సమావేశం నివేదికలు వినిపించడానికే పరిమితం అయ్యింది. శుక్రవారం నగర పంచాయతీ కార్యాలయంలో వైస్ చైర్మన్ పర్వీన్ అధ్యక్షతన వార్డు కౌన్సిల్ సాధారాణ సమావేశం నిర్వహించారు. అధికారులు నివేదికలు వినిపించడం మినహా సమస్యలపై చర్చ జరగలేదు. ఆయా కాలనీల్లో సమస్యలను వార్డు కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని షరామామూలుగా అధికారులు సమాధానం ఇచ్చారు. ప్రతి సమావేశంలో డ్రైనేజీలు, నీటి సమస్య, వీధిలైట్ల సమస్య తప్ప నిధుల వినియోగంపై చర్చించకపోవడం గమనార్హం. ప్రధానంగా అమృత-2.0 పథకం కింద సుమారు రూ.41 కోట్లతో ఇంటింటికి కొళాయి కనెక్షన్ ఎప్పుడు ప్రారంభిస్తారని కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నకు ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరలో పనులు ప్రారంభిస్తామని కమిషనర్ హరి ప్రసాద్ చెప్పారు. ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు ఇబ్రహీం, అంజి, షేక్ ముబీనా కోరారు. రక్షణ గోడలు ఏర్పాటు చేసి అక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని కమిషనర్ సమాధానం ఇచ్చారు. జంగాలపేటలో డ్రైనేజీ కాలువలు సరిగ్గా లేకపోవడంతో మురుగునీరు ఇళ్ల ముందుకు వస్తోందని కౌన్సిలర్ మహేశ్వరి అన్నారు.

హైందవ సంస్కృతి గొప్పది

డోన్: హైందవ సంస్కృతికి నిలువుటద్దాలు పండుగలని కర్నూలు ప్రభుత్వాస్పత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మాధవ కృష్ణ అన్నారు. పట్టణంలోని సాంబ శివాలయంలో కార్తీక శుక్రవారం సందర్భంగా విశేష కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సభకు సీనియర్ సివిల్ జడ్జి తంగమణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధవ కృష్ణ మాట్లాడుతూ.. ప్రపంచంలో నైతిక విలువలు, కట్టుబాట్లు, నియమ నిబంధనలు, నీతి చెప్పే గొప్ప సంస్కృతి హిందూ ధర్మానికే ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శేషావలిశర్మ, గంగాధర్‌శర్మ, శ్రీనివాసులు, ప్రభుత్వాస్పత్రి ప్రసూతి వైద్యురాలు రమ్యశిల్ప, యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శివలింగం చిత్రం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.



ఆలయం ఆవరణలో వేసిన శివలింగం చిత్రం

నిర్మలమైన భక్తియే ముక్తి మార్గం



గోమాత ప్రాముఖ్యతను వివరిస్తున్న ధర్మప్రచార పరిషత్ ప్రతినిధులు

ప్యాపిలి: నిర్మలమైన భక్తియే ముక్తికి మార్గమని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తొగట సురేష్‌బాబు అన్నారు. స్థానిక ఈశ్వర స్వామి దేవస్థానంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమాల్లో భాగంగా వేంకటేశ్వర స్వామి వేషధారణలో చిన్నారులు అలరించారు. గోమాత ప్రాముఖ్యతను వివరిస్తూ సరస్వతి శిశు మందిరం విద్యార్థులు శోభాయాత్ర నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ.. గోమాతను పూజించడం ద్వారా సకల శుభాలు జరుగుతాయన్నారు. శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలను ప్రతి రోజూ పఠనం చేయడం ద్వారా మానసిక ప్రశాంతతో పాటు తోటివారిపై ఎలా మెలగాలో తెలుస్తుందన్నారు. ప్రజలకు ధార్మిక విషయాలపై అవగాహన కల్పించేందుకు టీటీడీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రచార మండలి సభ్యులు దేవీదయానంద్ సింగ్, ఆలయ కమిటీ నిర్వాహకులు కంచి నరేశ్, రాంప్రతాప్, పట్టణ ప్రముఖులు రామాంజనేయులు, బంగి నాగరాజు, శరశ్చంద్రనాథ్ సింగ్, రవీంద్రనాథ్ సింగ్, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

సారా విక్రేతల అరెస్ట్

డోన్ రూరల్: నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం వివరాలను వెల్లడించారు. ప్యాపిలి మండలం అలేబాద్‌తండా గ్రామంలో దాడులు నిర్వహించామని చెప్పారు. గ్రామానికి చెందిన ముదువత్ బాలు నాయక్, ముదువత్ టిక్కిలీ నాయక్‌లను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారి నుంచి 190 లీటర్ల సారా, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. బెల్లం ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎస్‌ఐలు దౌలత్‌ఖాన్, సోమశేఖర్‌రావు, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, సుధాకర్‌రెడ్డి, రంగస్వామి, ఉమాకాంత్‌రెడ్డి, బషీర్ పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న సారాను చూపుతున్న సీఐ

పీఆర్‌టీయూ నూతన కమిటీ



సభ్యులతో ప్రమాణస్వీకారం చేస్తున్న దృశ్యం

బనగానపల్లె: పీఆర్‌టీయూ బనగానపల్లె మండల నూతన కమిటీని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామపుల్లారెడ్డి, కౌన్సిలర్ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక పీఆర్‌టీయూ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో మండల అధ్యక్షుడిగా డి. దస్తగిరి, ప్రధాన కార్యదర్శిగా ఎస్ అబ్దుల్‌షరీఫ్, అసోసియేట్ అధ్యక్షుడిగా జి.నాగేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసరెడ్డి, లక్ష్మీనారాయణమ్మ, కార్యదర్శిగా సురేష్, జిల్లా కౌన్సిలర్లుగా హుస్సేన్‌వలి, రామచంద్రారెడ్డి, రఘునాథ్, మహమ్మద్‌హనీఫ్, సుబ్రమణ్యం, వెంకటేశ్వర్లు, వెంకట శివుడులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ముకుందరెడ్డి, భాస్కర్ రెడ్డి, జీఎండీ రఫీ, బాలమద్దిలేటి పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు తెలంగాణలో ప్రత్యక్షం



శాంతినగర్ పోలీసు స్టేషన్‌లో ఉన్న వినయ్ కుమార్

డోన్ టౌన్ : రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన వినయ్‌కుమార్(6) తెలంగాణ రాష్ట్రం జోగులాంబ జిల్లా శాంతినగర్ పోలీసులకు చిక్కాడు. వివరాలు ఇలా ఉన్నాయి. డోన్ కొండపేటకు చెందిన బాబు కుమార్ కుమారుడు వినయ్‌కుమార్ పట్టణంలోని రాధాకృష్ణ స్కూల్‌లో 1వ తరగతి చదువుతున్నాడు. స్కూల్‌కు సరిగ్గా వెళ్లకపోవడంతో కొద్ది రోజుల క్రితం స్కూల్ యజమాన్యం బాలుడికి టీసీ ఇచ్చింది. ఈ క్రమంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకుండా పోయింది. చివరకు శాంతినగర్ పోలీసులకు చిక్కాడు. తెలంగాణ పోలీసులు డోన్ పట్టణ పోలీసుల సహాయంతో బాలుడి తండ్రి అడ్రస్సు తెలుసుకుని సమాచారం అందించారు. దీంతో కుటుంబ సభ్యులు శాంతినగర్‌కు వెళ్లినట్లు తెలిసింది. వినయ్‌కుమార్ సొంతంగా వెళ్లాడా? లేకుంటే ఎవరైనా తీసుకెళ్లారా అనే వివరాలు తెలియాల్సి ఉంది.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

డోన్ టౌన్: అనంతపురంలో ఈ నెల 24, 25వ తేదీల్లో జరిగిన 68వ రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో డోన్ పట్టణానికి చెందిన తన్విరెడ్డి, సాత్విరెడ్డి ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని శుక్రవారం కర్నూలు డీఈఓ సామ్యూల్ పాల్ తన కార్యాలయంలో అభినందించారు. కరాటే మాస్టర్ రమణ మాట్లాడుతూ.. వీరిద్దరు డిసెంబర్ 11 నుంచి 17వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రంలోని లుధియానా పట్టణంలో జరిగే జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. కర్నూలు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, కర్నూలు జిల్లా కరాటే అసోషియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, కరాటే మాస్టర్లు ఫయాజ్, జగదీష్ ఉన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న అధికారులు

మృతుని కుటుంబానికి రూ.25 లక్షలు అందజేత

కొలిమిగుండ్ల: కల్వటాల సమీపంలోని రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీలో ప్రమాదవశాత్తు జరిగిన ప్రమాదంలో మృతి చెందిన సురేష్‌ఆచారి కుటుంబాన్ని రామ్‌కో యాజమాన్యం ఆదుకుంది. శుక్రవారం ఫ్యాక్టరీ కార్యాలయంలో మృతుడి తల్లి సుబ్బలక్షుమ్మకు రూ.25 లక్షల చెక్‌ను యూనిట్ ఇన్‌చార్జ్ రెడ్డి నాగరాజు, అడ్మిన్‌హెడ్ రామరాజు అందజేశారు. రామ్‌కో యాజమాన్యానికి సుబ్బలక్షుమ్మ కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో సీనియర్ జనరల్ మేనేజర్ రవికుమార్ పాల్గొన్నారు. కాగా వైఎస్సార్ జిల్లా మైలవరం మండలం దన్నవాడకు చెందిన సురేష్‌ఆచారి ఫ్యాక్టరీలో కాంట్రాక్టర్ కింద పని చేస్తుండేవాడు. ఈనెల 3న డ్యూటీలో ఉండగా బొగ్గు క్రషర్ మిషన్‌ను క్లీన్ చేసే సమయంలో మిషన్ వాటంతట అదే ఆన్ కావడంతో తీవ్ర గాయాలై మృతి చెందిన విషయం తెలిసిందే.



చెక్కు అందజేస్తున్న రామ్‌కో యూనిట్ ఇన్‌చార్జ్ రెడ్డినాగరాజు

మృతుడి కుటుంబ సభ్యులకు పరామర్శ



పరామర్శిస్తున్న ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్

బేతంచెర్ల: పట్టణంలోని కొత్త బస్టాండ్ కాలనీకి చెందిన మహ్మద్ రఫీ కుమారుడు హిమాయత్ (29) గురువారం ఉరివేసుకుని ఆత్మ హత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి శుక్రవారం హిమాయత్ మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట ఫిరోజ్, బషీర్, గని ఉన్నారు.

జుర్రేరువాగు శుద్ధీకరణ పనులు ప్రారంభం

బనగానపల్లె రూరల్: పట్టణంలోని జుర్రేరువాగు శుద్ధీకరణ పనులను మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. వాగును పరిశుభ్రంగా ఉంచేందుకు మొదటి విడతలో భాగంగా సుమారు రూ.20 లక్షలతో 7.5 కిలోమీటర్ల మేరకు పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. జుర్రేరు వెంట ఉన్న ఆక్రమణలను తొలగిస్తామని స్పష్టం చేశారు. మైనర్ ఇరిగేషన్‌శాఖ అధికారులు ఉన్నారు.